# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

సోమవారం / 29.01.2024


# మాజీ మంత్రి జగదీష్ రెడ్డి దిగ్భ్రాంతి



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** మిర్యాలగూడలో జరిగిన ఘోర రోడ్ ప్రమాదం ఘటన పై మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం లో ఐదు గురు మృతి చెందడం విషాదకారమన్నారు.మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# అసెంబ్లీలో కుల గణన బిల్లు..!

* ఫిబ్రవరి రెండో వారంలో అసెంబ్లీ
* ఈసారి బీసీ కులగణన బిల్లు
* బీహార్, ఇతర రాష్ట్రాలకు అధికారుల బృందం
* 1931 కుల గణన ప్రామాణికం
* కులగణన బిల్లు, ముసాయిదా తయారీ బాధ్యతలు పొన్నం ప్రభాకర్‌కు
* కుల గణనపై సర్కారు స్పీడ్



**తెలంగాణవీణ, హైదరాబాద్ : రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం దాదాపు ఖరారైంది. వచ్చే నెల రెండో వారంలో ఈ సమావేశాల నిర్వహణకు రాష్ట్ర సర్కార్ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏప్రిల్ నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలోపు బడ్జెట్ ప్రతిపాదనలను రూపకల్పనకు సిద్ధమవుతోన్న ఆర్థిక శాఖ.. అవి ఉభయ సభల ఆమోదం పొందేలా కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే పలు శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన ఆర్థిక శాఖ... డిపార్ట్‌మెంట్ల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాలను కూడా ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుత పన్నులు, ధరలను దృష్టిలో ఉంచుకొని, 2024-25లో వచ్చే రాబడుల వివరాలను పేర్కొంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో వ్యయం అయ్యే మొత్తానికి సంబంధించిన వివరాలను నిర్వహణా వ్యయం, పథకాల అమలుకు అవసరమైన నిధులు వివరాలు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలు మారిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా పథకాలకు కేటాయింపులపై ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ సమావేశాల్లో ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన ఆరు గ్యారంటీల అమలు, అసంపూర్తి ప్రాజెక్టుల నిర్మాణం, సాధారణ పరిపాలన నిర్వహణకు అవసరమైన నిధుల కేటాయింపులపై స్పష్టత రానుంది.** ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన రాష్ట్రంలో కుల గణన హామీపై కసరత్తు మొదలుపెట్టిన రాష్ట్ర సర్కార్ ఈ సమావేశాల్లోనే బీసీ కులగణన బిల్లు ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఇందులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఆచితూచీ వ్యవహరిస్తోంది. కులగణన నిర్వహణపై అధ్యయనం చేపట్టేందుకు రాష్ట్ర అధికారులతో కూడిన బృందం ఏర్పాటుకు కసరత్తు పూర్తి చేసింది. వీరిని బీహార్, ఇతర రాష్ట్రాలకు పంపి అక్కడి ప్రభుత్వాలు చేపట్టిన కులగణన తీరు.. ఆ ప్రక్రియలో తలెత్తే సమస్యలు, ప్రతికూల పరిస్థితులతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో జరపతలపెట్టిన ఈ ప్రక్రియను 1931 కుల గణనను ప్రామాణికంగా తీసుకుని పూర్తి చేయాలని భావిస్తున్నది. మరోవైపు.. కులగణన బిల్లు, ముసాయిదా తయారీ బాధ్యతలను ఆ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్‌కు అప్పగించింది. మరోవైపు.. ఇటీవల సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణనకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా కులగణన కసరత్తు ముమ్మరం చేయడంతో 2014లో పూర్తయిన కుల గణన త్వరలోనే మరోసారి జరగనుంది.


# జీవో నంబరు 59 క్రమబద్ధీకరణ స్థలాల్లో అనుమతుల నిలిపివేత...!

**తెలంగాణవీణ, హైదరాబాద్ :** జీవో నంబరు 59 కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి పునఃపరిశీలన పూర్తయ్యే వరకు



నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు ఇవ్వరాదని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదివారం అత్యవసరంగా ఉత్తర్వులు జారీ చేశారు.రంగారెడ్డి, మేడ్చల్ –మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో తదుపరి ఆదేశాలు వచ్చేవరకు నిలిపేయాలని చీఫ్ సిటీ ప్లానర్, జోనల్ కమిషనర్లు, అదనపు సిటీ చీఫ్ ప్లానర్లు, సిటీ ప్లానర్లు, డిప్యూటీ కమిషనర్లు, డిప్యూటీ సిటీ ప్లానర్లు, సహాయ సిటీ ప్లానర్లను ఆదేశించారు. అక్రమ క్రమబద్ధీకరణపై ఫిర్యాదులు రావడంతో తెలంగాణ ప్రభుత్వ భూ పరిపాలన చీఫ్ కమిషనర్(సీసీఎల్) నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఏమైనా సందేహాలుంటే కలెక్టర్ కార్యాలయం నుంచి నివృత్తి చేసుకోవాలన్నారు..

# బాబు కు తప్పిన ప్రమాదం



**తెలంగాణ వీణ , రాజమండ్రి :** రా... కదలి రా సభలో టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రమాదం తప్పింది. రాజమండ్రి రూరల్ కాతేరులో జరిగిన ఈ సభకు భారీ ఎత్తున జనాలు హాజరయ్యారు. కాగా, సభ ముగిసిన అనంతరం వేదికపై తోపులాట చోటుచేసుకుంది. చంద్రబాబు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి నెలకొంది. దాంతో ఆయన వేదిక అంచు వరకు వచ్చి నిలబడ్డారు. అప్పటికే జనం తోసుకుంటూనే ఉండడంతో చంద్రబాబు జారి కిందపడబోయారు. మెరుపువేగంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది తమ చేతులు అడ్డుపెట్టి చంద్రబాబు కిందపడకుండా కాపాడారు. అక్కడున్న జనంపై చంద్రబాబు సెక్యూరిటీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను అక్కడ్నుంచి సురక్షితంగా తీసుకెళ్లారు.

## ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ పేరుతో సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్..

* నకిలీ అకౌంట్ పై పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు..
* సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు విచారణ..

# వైఎస్ షర్మిలతో వివేకా కుమార్తె సునీత భేటీ




**తెలంగాణవీణ, కడప :** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీత ఇడుపులపాయలో భేటీ అయ్యారు. దాదాపు 2 గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆమె కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం దృష్ట్యా ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టిన అనంతరం సునీత ఆమెను కలవడం ఇదే తొలిసారి. సమావేశానంతరం వారిద్దరూ కలిసి వైఎస్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ భేటీలో సునీత రాజకీయ ప్రవేశంపై చర్చ జరిగినట్లు సమాచారం. తన తండ్రి హత్యపై సునీత తొలి నుంచి గట్టి పోరాటమే చేస్తున్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి సీబీఐ విచారణ కోరడం.. ఆ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి రావడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే పలువురు అరెస్టు కూడా అయ్యారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డి ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. భాస్కరరెడ్డితో పాటు ఇతరులు చంచల్‌గూడ జైలులో రిమాండు ఖైదీలుగా ఉండగా.. అవినాష్‌రెడ్డి బెయిల్ తెచ్చుకున్నారు. దీనిపై సునీత సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నారు. ఇది చేస్తూనే తన తండ్రిని హత్య చేసిన వ్యక్తులను రాజకీయంగా ఎదుర్కోవాలని సునీత భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# సాక్షిలో జగన్ తో పాటు నాక్కూడా సగం వాటా ఉంది : వైఎస్ షర్మిల



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** సాక్షి పత్రికలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఇంత నీచానికి దిగజారి తనపై దుష్ప్రచారం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సాక్షి మీడియాలో జగన్ తో సమానంగా తనకు కూడా సగం వాటా ఉందని ఆమె చెప్పారు. తన తండ్రి వైఎస్సార్ సాక్షిలో జగన్ కు, తనకు సమానంగా వాటా ఉండాలని భావించారని అన్నారు. కడపలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడున్న జగన్ ఎవరో తనకు తెలియదని షర్మిల అన్నారు. గతంలో ఉన్న జగన్ తనకు అన్న అని... సీఎం అయిన తర్వాత ఆయన పూర్తిగా మారిపోయారని చెప్పారు. రక్తం పంచుకుని పుట్టిన తనపై... రోజుకొక దొంగతో జగన్ తిట్టిస్తున్నారని మండిపడ్డారు. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా... అత్యంత నీచంగా ప్రచారం చేయిస్తున్నారని అన్నారు. ఎవరెంత చేసినా భయపడే ప్రసక్తే లేదని... ఏం పీక్కుంటారో పీక్కోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కడప తాను పుట్టిన ఇల్లు అని షర్మిల అన్నారు. జగన్ మాదిరి తాను కూడా ఒక్కడే పుట్టానని, జమ్మలమడుగు ఆసుపత్రిలో పుట్టానని చెప్పారు. జగన్ కు, పార్టీకి తాను చేసిన సేవలు వైసీపీ క్యాడర్ కు గుర్తులేవన్నారు. తన మీద రోజుకొక కథ అల్లుతున్నారని మండిపడ్డారు. తనపై బురద చల్లేందుకు రోజుకొక జోకర్ ను తెస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో జాతకాలు మారాలని అన్నారు. విలువలు, విశ్వసనీయతలు మీకు లేవా? అని ప్రశ్నించారు. తాను రాజశేఖరరెడ్డి కూతురు వైఎస్ షర్మిలారెడ్డినని... ఇదే తన ఉనికి అని చెప్పారు.

# సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ..



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని కోరుతూ... హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం సవాల్ చేసింది. ఈ పిటిషన్ ను విచారించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏపీ ప్రభుత్వ పిటిషన్ ను తిరస్కరించింది. ఇదే కేసులో సహ నిందితులపై ఉన్న ఉత్తర్వులు చంద్రబాబుకు కూడా వర్తిస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది. 2022లో ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలయిందని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసులోని ఇతర నిందితులంతా ముందస్తు బెయిల్ పై ఉన్నారని... చంద్రబాబు బెయిల్ మాత్రమే రద్దు చేయాలని ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించింది. ఒకే ఎఫ్ఐఆర్ లో ఉన్న నిందితులంతా బెయిల్ పై ఉన్నప్పుడు... అవే నిబంధనలు చంద్రబాబుకు కూడా వర్తిస్తాయని తెలిపింది. చంద్రబాబుకు నోటీసులు ఇవ్వడానికి కూడా సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ కేసులో కూడా 17ఏ నిబంధన వర్తిస్తే ఏం చేస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. విచారణ సందర్భంగా, సెక్షన్ 420 కింద కూడా దర్యాప్తు జరుగుతుందని సుప్రీంకోర్టుకు ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపారు. పలు ఐపీసీ సెక్షన్లు కూడా దీనికి ఉన్నాయని చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ... ఈ కేసుకు సెక్షన్ 420 ఎలా వర్తిస్తుందని ప్రశ్నించింది. ప్రస్తుత దశలో ఈ కేసులో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ పిటిషన్ ను తోసిపుచ్చింది. చంద్రబాబుపై సుప్రీంకోర్టులో ఉన్న కేసుల వివరాలన్నింటినీ సుప్రీంకోర్టు తీసుకుంది. చంద్రబాబు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా పలు ధర్మాసనాల ముందు ఉన్న చంద్రబాబు కేసుల వివరాలను సుప్రీంకోర్టుకు అందించారు.

# 200 రోజుల్లో థియేటర్లలోకి "పుష్ప 2 ది రూల్"

**తెలంగాణవీణ, సినిమా :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం పుష్ప 2 ది రూల్. మొదటి భాగం పుష్ప ది రైజ్ థియేటర్ల లో రిలీజ్ అయ్యి ప్రేక్షకులను, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంది. సీక్వెల్ పుష్ప 2 ది రూల్ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం మరో 200 రోజుల్లో థియేటర్ల లోకి రానుంది. ఆగస్ట్ 15, 2024 న సినిమా రిలీజ్ కానున్నట్లు మరోసారి సరికొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు మేకర్స్. స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న లేడీ లీడ్ రోల్ లో నటిస్తున్న ఈ చిత్రంలో ఫాహద్ ఫజిల్, ధనంజయ, అనసూయ భరద్వాజ్, సునీల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా కోసం ఆడియెన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.




## కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్సారెడ్డి మృతిపట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన పలువురు ప్రముఖులు



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎంపీగా, ఎంఎల్సీగా, ఎమ్మెల్యేగా, పీసీసీ అధ్యక్షునిగా సేవలు అందించిన నర్సారెడ్డిమృతిపట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ. నర్సారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నాగబాబు, అంబటి మధ్య సోషల్ మీడియా వార్



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఏపీ మంత్రి అంబటి రాంబాబు మధ్య సోషల్ మీడియా యుద్ధం జరుగుతోంది. భీమిలిలో నిర్వహించిన సిద్ధం సభలో సీఎం జగన్ మాట్లాడుతూ, "పద్మవ్యూహంలో చిక్కుకోవడానికి నేను అభిమన్యుడ్ని కాదు... అర్జునుడ్ని" అంటూ వ్యాఖ్యానించారు. నాగబాబు ఎక్స్ లో స్పందిస్తూ... "వెంకటేశ్వరస్వామి ప్రసాదాలు టిష్యూ పేపర్లో చుట్టి పక్కనపెట్టే మీకెందుకండీ రామాయణ, మహాభారత ఉదాహరణలు?" అంటూ దెప్పిపొడిచారు. నాగబాబు వ్యాఖ్యలకు మంత్రి అంబటి రాంబాబు కౌంటర్ ఇచ్చారు. "పవిత్ర దీపారాధనతో సిగరెట్ ముట్టించుకునే మీకెందుకు సార్ ఈ ఉదాహరణలు!" అంటూ నాగబాబును ట్యాగ్ చేశారు.